
ప్రజాశక్తి

మంగళవారం 17 అక్టోబర్ 2023



ఇవిఎంల తనిఖీ

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఇవిఎంల తనిఖీ ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆధ్వర్యాన సుమారు 20 రోజుల పాటు ప్రతి రోజూ ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 7 గంటల వరకు ఇవిఎమ్‌ల మొదటి దశ తనిఖీలను బెంగుళూరు బిఇఎల్ ఇంజినీర్లు నిర్వహించనున్నారు. అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఉన్న సందేహాలు, అపోహలను నివృత్తి చేసేందుకు మొదటి దశ ఇవిఎంల తనిఖీలకు ప్రతిరోజు హాజరు కావాలని సమాచారం అందించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు. ఎటువంటి సందేహాలు ఉన్నా నిపుణుల వద్ద నివృత్తి చేసుకునే అవకాశం ఉంది. ఇవిఎం గోదాముల వద్ద భద్రతను, వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లను పరిశీలించారు.



పెద్దవలస ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో అక్రమంగా ఏర్పాటుచేసిన విద్యుత్తు లైన్ ఇదే

విద్యుత్తు శాఖలో
దొంగలు పడ్డారు!?

- ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలు, కేబుల్ వైర్లు చోరీ
- అనధికార విద్యుత్తు లైన్లకు, ప్రయివేట్ లేఅవుట్లకు విక్రయాలు
- చోద్యం చూస్తున్న ఉన్నతాధికారులు

విద్యుత్తు శాఖకు సంబంధించిన పలు వస్తువులు చోరీకి గురవుతున్నాయి. విద్యుత్తు స్తంభాలు, కేబుల్ వైర్లు, ఇతర సామగ్రి అపహరించుకుపోతూ అనధికారకంగా ప్రయివేటు వ్యక్తులకు లైన్లు ఏర్పాటు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దొంగలు ఎత్తుకెళ్లినా, ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్ చోరీకి గురైనా అధికారులు ఇంతవరకు చర్యలు చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అదే శాఖలో చెందిన కొంతమంది సిబ్బంది.. ప్రయివేట్ వ్యక్తులతో చేతులు కలిపి ఇలాంటి చోరీలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి-మక్కువ

మండలంలోని పలు ప్రాంతాల్లో పనిచేయని ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్న విషయం సంబంధిత సిబ్బందికి తప్ప మిగతా వ్యక్తులకు తెలియదు. అలాంటి ట్రాన్స్‌ఫార్మర్లలో కాపర్ వైర్లు చోరీ చేస్తూ పబ్లిక్‌గా రహదారిపై పడేసే సందర్భాలు కూడా చోటు చేసుకోవడం గమనార్హం. దొంగిలించిన పరికరాలతో దూరప్రాంతాల్లో ఉండే పొలాలకు అనధికారంగా విద్యుత్తు లైన్లు కలుపుకుపోతున్నారనే ఆరోపణలు కూడా వ్యక్తమవుతున్నాయి. శంబర గ్రామంలో పెద్దమనిషిగా వ్యవహరిస్తున్న ఓ వ్యక్తి పెద్దవలస సమీపంలో తన పొలంలోకి అక్రమ విద్యుత్తు కనెక్షన్ ఏర్పాటు చేయడంతో అక్కడ రైతుల మధ్య కొంత వివాదం నెలకొంది. ఇటీవల విద్యుత్తు శాఖలో చోటుచేసుకున్న పరిణామాలు నేపథ్యంలో సదరు పెద్దమనిషి.. రైతుల ఆగ్రహానికి గురై కేబుల్‌ను తొలగించి ఖాళీ స్తంభాలను అలాగే ఉంచుకున్నారని తెలిసింది. ఇలాంటి పనులకు తెగబడుతున్న విద్యుత్తు సిబ్బందిని ఉన్నతాధికారులు సైతం విచారణ సమయంలో అసలు సమాచారాన్ని పంపించకుండా మామూళ్ల మత్తులో జోగుతున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.

డామేజ్ పేరుతో లూటీ?

విద్యుత్తు శాఖలో ఉండే పరికరాలు ఏవీ కూడా చంకలో పెట్టి పట్టుకుపోయేవి కాదన్న సంగతి అందరికీ తెలిసిందే. అయితే ఆ శాఖ నిబంధనలను తమకు అనుకూలంగా మార్చుకుంటూ కొంతమంది వ్యక్తులు ప్రభుత్వ ఆస్తిని కాజేస్తున్నారని తెలుస్తోంది. ప్రమాదకరంగా విద్యుత్తు స్తంభాలు ఉన్నాయంటూ, వాటి స్థానంలో కొత్త వాటిని నియమించాలంటూ, వాటికి సంబంధించిన కేబుల్, ఇతర పరికరాలు ప్రభుత్వం ద్వారా డ్రా చేసుకొని ఇలా దొంగచాటు వ్యవహారాలకు వినియోగిస్తూ ఉంటారని పలువురు చర్చించుకుంటున్నారు. రైతుల పొలాలకు వేసే విద్యుత్తు కనెక్షన్లలో అంచనాలు ఎక్కువ చూపి, రికార్డుల్లో చూపిన వాటికంటే తక్కువ స్తంభాలను వినియోగించి, కొన్ని స్తంభాలను పక్కన పెట్టి ప్రయివేటు వ్యక్తులకు రహస్యంగా విక్రయిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇవన్నీ ఉన్నతాధికారులకు తెలిసినా వారికి కూడా వెళ్లాల్సిన మొత్తాలు ఐదు శాతం నుండి 25 శాతం వరకు ఆయా పనులు బట్టి సంబంధిత సిబ్బంది చేరవేస్తారని చర్చ సాగుతోంది. దీంతో తప్పులను సరిదిద్దాల్సిన అధికారులు తప్పుడు సమాచారాలను ఉన్నతాధికారులకు చేరవేస్తూ, వీరిని రక్షిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పారదర్శకంగా విచారణ చేపడితే మరెన్నో అక్రమాలను అరికట్టి, ప్రభుత్వ ఆస్తిని కాపాడవచ్చని పలువురు అభిప్రాయపడుతున్నారు.



అక్రమంగా ఏర్పాటు చేసిన విద్యుత్తు స్తంభం



డిఎఫ్ఒ కారుకు అడ్డంగా నిల్చొన్న గిరిజన, ప్రజా సంఘాల నాయకులు, గిరిజనులు

ఏనుగులను తరలించాల్సిందే

అటవీశాఖ కార్యాలయం ఎదుట గిరిజనుల ధర్నా

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

జిల్లాలో ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని సోమవారం జిల్లా అటవీ శాఖ కార్యాలయం ఎదుట ఆదివాసీ గిరిజన సంఘం, రైతుసంఘం, వ్యకాస, ఐద్వా, సిఐటియు ఆధ్వర్యాన ధర్నా చేపట్టారు. అటవీశాఖ సిబ్బంది ముందుగా కార్యాలయ గేట్లకు తాళాలు వేశారు. దీంతో కార్యాలయం ముందే కూర్చుని నిరసన తెలియజేశారు. అనంతరం కార్యాలయానికి వచ్చిన డిఎఫ్ఒ కారును చుట్టుముట్టి ఘెరావ్ చేశారుక. పోలీసుల జోక్యంతో ఆమె కార్యాలయంలోకి గిరిజనులను, నాయకులను అనుమతించారు. అనంతరం డిఎఫ్ఒను కలిసి వినతి సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ జిల్లాలోకి 2000 సంవత్సరంలో శ్రీకాకుళం జిల్లా మీదుగా ప్రవేశించాయని, అధికారులు గిరిజనుల కష్టాలను గమనించి, ఆపరేషన్ గజ పేరుతో తరలించారని గుర్తుచేశారు. 2018లో మళ్లీ ఒడిశా నుంచి జిల్లాలోకి ప్రవేశించి, కురుపాం, పాలకొండ నియోజకవర్గాల పరిధిలోని గ్రామాల్లో సంచరిస్తున్నాయని తెలిపారు. అడవి నుండి వచ్చిన ఏనుగులు ప్రజలకు పెను సమస్యగా మారి, ఇప్పటికి 11 మంది ప్రాణాలు బలిగొన్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రూ.4 కోట్లు మేర పంట, పశు నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పుడు మైదాన ప్రాంతంలో రోడ్లపైకి వచ్చి బీభత్సాన్ని సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని తెలిపారు. ఈ సమస్యపై ప్రభుత్వం, అటవీ శాఖ అధికారులు చర్యలు నామమాత్రంగా ఉన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారులు వెంటనే స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏనుగుల దాడిలో నష్టపోయిన వారికి బకాయి పరిహారం చెల్లించాలన్నారు. పంటలకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. డిఎఫ్ఒ జిపిపి ప్రసూన స్పందిస్తూ సాంకేతిక సమస్యల వల్ల కొందరు బాధితుల విషయమై జాప్యం జరుగుతున్న మాట వాస్తవమేనన్నారు. తన దృష్టికి తీసుకొస్తే సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఏనుగుల సమస్యపై అధ్యయనం చేసిన కమిటీ సిఫార్సుల మేరకు ఏనుగుల గుంపును మచ్చిక చేసుకుని వాటిని అదుపులోకి తీసుకునేందుకు రెండు మచ్చిక ఏనుగులు (కొంకీలు) రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. శిక్షణ పొందిన ఏనుగులను సంరక్షించేందుకు జోగింపేట అటవీప్రాంతాన్ని గుర్తించామని, త్వరలోనే కార్యాచరణ మొదలైతే ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు వి.ఇందిర, కోశాధికారి జి.వెంకటరమణ, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కొల్లి సాంబమూర్తి, కోరాడ ఈశ్వరరావు, నిర్వాసితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బంటుదాసు, తదితరులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న డిఎఫ్ఒ ప్రసూన



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

సిపిఎస్, జిపిఎస్ రద్దుకు
19 నుంచి యుటిఎఫ్ నిరవధిక దీక్షలు

ప్రజాశక్తి- పార్వతీపురం

సిపిఎస్‌ను, జిపిఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 19 నుంచి యుటిఎఫ్ ఆధ్వర్యాన కలెక్టరేట్ వద్ద నిరవధిక నిరాహారదీక్ష చేయనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎస్.మురళీమోహన్‌రావు తెలిపారు. సోమవారం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను సుందరయ్య భవనంలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ముఖ్యమంత్రి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడు తన పాదయాత్రలో అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోసిపిఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని, ఇప్పుడు సిపిఎస్ స్థానంలో జిపిఎస్ తీసుకొచ్చిన ఉపాధ్యాయులను, ఉద్యోగులను మోసం చేశాడని అన్నారు. ఈనేపథ్యంలో సిపిఎస్ వద్దు - జిపిఎస్ వద్దు- ఒపిఎస్ కావాలి అనే నినాదంతో ఈనెల 18 నుండి రాష్ట్ర కేంద్రం విజయవాడలోనూ, ఈ నెల 19 నుంచి పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిరవదిక నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. దీక్షలలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు అత్యధిక సంఖ్యలో పాల్గొనాలని, పాల్గొనని వారు శిభిరానికి వచ్చి మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో యుటిఎఫ్‌జిల్లా కోశాధికారి కె.మురళి, జిల్లా కార్యదర్శులు ఎన్.శ్రీనివాసరావు, పి.వెంకట నాయుడు, టి. శ్రీనివాసరావు, హరికృష్ణ పాల్గొన్నారు.

పాస్‌పుస్తకాలను సరిచేయాలి

కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి-సీతానగరం, పార్వతీపురం

భూ సమగ్ర రీ సర్వే పేరుతో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమంలో రైతుల భూములను, వాస్తవ సాగుదారులను గుర్తించి సాగు దారుల పేర్లు, సర్వే నంబర్లు సరి చేయాలని రైతులు కోరారు. ఈమేరకు కలెక్టరేట్ వద్ద రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. అంటిపేట రెవెన్యూ గ్రామ పరిధిలో గల రైతుల భూముల వివరాలు తప్పులు తడకలుతో పట్టాదారు పాసు పుస్తకాలను పంపిణీ చేశారని అన్నారు. ప్రభుత్వం కొండను తవ్వి ఎలకను పట్టిన చందంగా భూ సర్వే ఉందని అన్నారు. అనంతరం కలెక్టర్ గారికి గ్రీవెన్స్ లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో రైతులు మూడడ్ల రాఘవ, రెడ్డి సత్యనారాయణ, రెడ్డి నారాయణ రావు, రెడ్డి శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయాలని ధర్నా

రైతుల భూములను బలవంతంగా అటవీశాఖకు బదలాయించే నిర్ణయం ఉపసంహరించుకోవాలని సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు బి.వి.రమణ మాట్లాడుతూ గరుగుబిల్లి మండలంలోని గొట్టివలస, ఉల్లిభద్ర, దలాయివలస రెవెన్యూ పరిధిలో అనేక సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్న రైతులకు 2008లో ప్రభుత్వం డి-పట్టాలు మంజూరు చేసిందని తెలిపారు. ఆ భూముల్లో టేకు, నీలగిరి, జీడి, మామిడి మొక్కలను నాటారని తెలిపారు. రెవెన్యూ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సర్వే నంబర్ 272, 273, 274లో ఉన్న రైతులను కనీసం సంప్రదించకుండా వారి భూములను అటవీ శాఖకు బదలాయించారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అటవీశాఖకు బదలాయించిన భూమిని గొట్టివలస సర్వే నంబర్ 279గా అధికారుల పేర్కొని, పట్టాలు పొంది సాగులో ఉన్న రైతులను తొలగించడం దారుణమన్నారు. ఓ మత పూజా సామగ్రిని ధ్వంసం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దౌర్జన్యంగా ట్రెంచ్ నిర్మాణం చేస్తున్నారని, తక్షణమే ఈ పనులను నిలుపుదల చేయాలని ఆర్‌డిఒ హేమలతకు వినతి అందించారు. కార్యక్రమంలో సుంకి సర్పంచ్ కరణం రవీంద్ర, బొండపల్లి ప్రసాదరావు, బోను శంకరరావు, బోనెల వెంకటి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు, రైతుసంఘాల సమన్వయ కమిటీ నాయకులు

స్పందనకు 49 వినతులు

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎలో పిఒ కల్పనకుమారి ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ స్పందనకు 49 వినతులు వచ్చాయి. సొంటినూరు గ్రామానికి చెందిన చిన్నమ్మి మినీ ట్రాక్టర్ మంజూరు చేయాలని విన్నవించారు సొంటినూరుకు చెందిన ఉమాపతి పవర్ టిల్లర్ మంజూరు చేయాలని కోరారు. కింద్రువాడకు చెందిన రామారావు విద్యుత్తులైను మార్చాలని కోరారు. అమారి మానుగూడకు చెందిన త్రినాథరావు సిసి రోడ్డు మంజూరు చేయాలని విన్నవించారు. చంద్రయ్యపేటకు చెందిన శ్రీధర్ మేకల లోను ఇప్పించాలని కోరారు. సవరాంపురం గ్రామానికి చెందిన సంపతిరావు కోత మిషన్ మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. ఈ కార్యక్రమంలో ఎపిఒ రోసిరెడ్డి, డిడి మంగవేణి, ట్రైబల్ వెల్ఫేర్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సింహాచలం, డిప్యూటీ డిఇఒ లిల్లీరాణి, స్పోర్ట్స్ ఇన్‌ఛార్జి జాకబ్ దయానంద్, పిహెచ్ఒ గణేష్, పిఎఒ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



వినతులు స్వీకరిస్తున్న పిఒ కల్పనకుమారి



నిరసన తెలుపుతున్న గ్రీన్ అంబాసిడర్లు

బకాయి వేతనాలు చెల్లించాలని
గ్రీన్‌అంబాసిడర్ల నిరసన

ప్రజాశక్తి-పార్వతీపురం

గ్రీన్ అంబాసిడర్లకు 12 నెలల బకాయిలు వేతనాలు చెల్లించాలని సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌లో వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు గొర్లి వెంకటరమణ మాట్లాడుతూ గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజారోగ్యాన్ని పరిరక్షిస్తున్న గ్రీన్‌అంబాసిడర్లకు ఏడాదిపాటు జీతాలు చెల్లించకపోతే వారు ఎలా కుటుంబాలను పోషించుకోగలరని ప్రశ్నించారు. గతంలో స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా వీరి వేతనాలు చెల్లించేవారని గుర్తుచేశారు. తర్వాత కాలంలో పంచాయతీలకు అప్పగించిన తర్వాత వీరి బాధలు దారుణంగా ఉన్నాయన్నారు. తక్షణమే గ్రీన్‌అంబాసిడర్లకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు గవర వెంకటరమణ, గ్రీన్ అంబాసిడర్ల నాయకులు జలుమూరు గౌరీ, కందుకూరి రాము, తోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

మున్సిపాలిటీలోని 29వ వార్డు పరిధిలో కుసుమ గుడ్డివీధిలో కాలువలు, సిసి రోడ్డు పనులకు ఎమ్మెల్యే అలజంగి జోగారావు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా తన దృష్టికి వచ్చిన వార్డు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బి.గౌరీశ్వరి, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వరరావు, వైసిపి పట్టణ అధ్యక్షులు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్ లీడర్ మంత్రి రవికుమార్, కౌన్సిలర్లు యడ్ల త్రినాథరావు, ఆర్ చిన్నంనాయుడు, ఆర్ బంగారి నాయుడు, జెసిఎస్ కన్వీనర్ గొర్లి మాధవ్ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు


డిప్యూటీ సిఎంని కలిసిన ఎడిఇ

ప్రజాశక్తి-సాలూరు

డిప్యూటీ సిఎం రాజన్నదొరని సోమవారం ట్రాన్స్‌కో ఎడిఇ వి.రంగారావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఎడిఇగా బాధ్యతలు చేపట్టిన తర్వాత రంగారావు డిప్యూటీ సిఎం రాజన్నదొరని కలిశారు. ఆయన ఏలూరు జిల్లా నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి ఎడిఇగా వచ్చారు. ఆయన వెంట ఎఇ సింహాచలం, లైన్‌మేన్ సత్యనారాయణ ఉన్నారు.

అర్బన్, రూరల్ సెక్షన్లుగా విడదీయండి : డిప్యూటీ సిఎం

ట్రాన్స్‌కో విభాగంలో సాలూరు పట్టణం, మండలాన్ని వేర్వేరు సెక్షన్లుగా విడదీసేందుకు ప్రతిపాదనలు పంపించాలని డిప్యూటీ సిఎం రాజన్నదొర ఎడిఇ రంగారావును ఆదేశించారు. సుమారు 33 వేల విద్యుత్తు సర్వీసులున్నా ఒకే సెక్షన్‌గా పరిగణించడం సరికాదని చెప్పారు. దీనివల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే రెండు సెక్షన్లుగా విడదీస్తూ ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. తాను కూడా ఉన్నతాధికారులతో మాట్లాడతానని చెప్పారు.



డిప్యూటీ సిఎంకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ట్రాన్స్‌కో ఎడిఇ రంగారావు

సమస్యలకు పరిష్కార మార్గం.. స్పందన

ప్రజాశక్తి -పార్వతీపురం రూరల్

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చక్కటి మార్గం స్పందన కార్యక్రమమని ఎఎస్‌పి దిలీప్ కిరణ్ అన్నారు. ఎస్‌పి కార్యాలయంలో సోమ వారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆయన అర్జీలను స్వీకరించారు. అర్జీదారు లతో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకొని, వారి సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించారు. సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఫోన్లో మాట్లాడి సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని సూచించారు. తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో దిశా డిఎస్‌పి ఎస్.ఆర్.హర్షిత, ఎస్బి సిఐ సిహెచ్.లక్ష్మణ రావు, డిసిఆర్‌బి సిఐ ఎన్.వి.ప్రభాకర రావు, ఎస్ఐ పాపారావు, సిబ్బంది పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎఎస్‌పి దిలీప్ కిరణ్

ఎపిఎంఎంఇఎ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అహ్మద్

ప్రజాశక్తి-సాలూరు

ఎపి మున్సిపల్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎస్ ఎఫ్ అహ్మద్ ఎన్నికయ్యారు. అహ్మద్ మున్సిపాలిటీలో సీనియర్ అసిస్టెంట్, రెవిన్యూ ఇన్స్పెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈనెల 15న భీమవరంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికల్లో అహ్మద్‌ను ఆర్గనైజింగ్ సెక్రటరీ గా ఎన్నుకున్నారు. సహాధ్యక్షులుగా విజయనగరం కార్పొరేషను చెందిన వైఎస్ సిహెచ్.పాపయ్య రాజు ఎన్నికయ్యారు. మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షుడిగా అహ్మద్ ఇప్పటికే కొనసాగుతున్నారు. రాష్ట్ర అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గా అహ్మద్ ఎన్నిక కావడంపై స్థానిక మున్సిపల్ కమిషనర్ టి.జయరాం, ఉద్యోగులు హర్షం వ్యక్తంచేశారు.



ఎస్ఎఫ్ అహ్మద్

కరువు మండలాలుగా ప్రకటించాలి

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం


నందివాడ కృష్ణబాబు

గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని టిడిపి ఎస్‌టి సెల్ అరకు పార్లమెంట్ అధికార ప్రతినిధి నందివాడ కృష్ణబాబు ప్రభుత్వాన్ని కోరారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ ఏజెన్సీలో జీవగెడ్డలపై సాగునీటి ప్రాజెక్టులు, మినీ రిజర్వాయర్లు, చెక్ డ్యాములు లేవన్నారు. గతంలో అక్కడక్కడ నిర్మించిన చెక్ డ్యాములు పూర్తిగా శిథిలమయ్యాయని తెలిపారు. దీంతో గిరిజన రైతులు వర్షాధారంపైనే ఆధారపడి పంటలు పండిస్తున్నారని తెలిపారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురవలేదని, అనుకున్నంత స్థాయిలో వర్షపాతం నమోదు కాలేదని చెప్పారు. ఆగస్టులో కురిసిన కొద్దిపాటి వర్షాలతో రైతులు వరినాట్లు వేశారని చెప్పారు. దీంతో గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల్లో ఆలస్యంగా వరి నాట్లు పడ్డాయని, అవి కూడా పూర్తిస్థాయిలో జరగలేదని చెప్పారు. వర్షాలు కురవకపోవడం, వరి పైరు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. కొద్దో గొప్పో పంట చేతికి అందిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసే పరిస్థితి కనిపించడం లేదని వాపోయారు. రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో ప్రోత్సహించడం లేదన్నారు. ఈ ఏడాది కరువు ప్రభావం కనిపిస్తోందని, ప్రభుత్వం స్పందించి కరువు మండలాలుగా ప్రకటించి, గిరిజన రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.


కిశోరచంద్రదేవ్‌ను పరామర్శిస్తున్న బేబినాయన

కిశోర్‌కు బేబినాయన పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

కేంద్ర మాజీ మంత్రి వైరిచర్ల కిశోర్‌చంద్రదేవ్ సోదరి కుసుమాంజలి దేవి ఇటీవల చెన్నైలో గుండె పోటుతో మృతిచెందారు. ఈ విషయం తెలుసుకొని టిడిపి బొబ్బిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బేబినాయన సోమవారం కురుపాంలో కిశోర్ కోటకు వచ్చి పరామర్శించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు డొంకాడ రామకృష్ణ, తెలుగు యువత అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, జియ్యమ్మవలస ఎంపిపి బొంగు సురేష్, టిడిపి నాయకులు పల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల బారి నుండి రక్షించండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

బీభత్సం సృష్టిస్తున్న ఏనుగుల నుంచి తమకు రక్షణ కల్పించాలని తిత్తిరి పంచాయతీ పరిధిలో గిరిజనులు కలెక్టర్‌ను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సిపిఐ ఆధ్వర్యాన గిరిజనులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. రెండేళ్ల నుంచి ఏనుగులు సంచరిస్తున్నాయని, పంటలను, తిండిగింజలను ధ్వంసం చేస్తున్నాయని గిరిజనులు ఆవేదన వ్యక్తంచేశారు. వెంటనే ఏనుగులను తరలించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.మన్మథరావు, నాయకులు టి.జీవన్, జి.సూరయ్య పాల్గొన్నారు.


పట్టాలు చూపిస్తూ వినతి అందిస్తున్న గిరిజన రైతులు

న్యాయం చేయాలని గిరిజనుల వినతి

ప్రజాశక్తి-పాచిపెంట

తమకు న్యాయం చేయాలని గొట్టూరు పంచాయతీ పొలంవలస గ్రామానికి చెందిన గిరిజన రైతులు సోమవారం గ్రీవెన్స్‌లో తహశీల్దార్ రాజశేఖర్‌కు వినతి అందించారు. ఐదో విడత భూ పంపిణీ కార్యక్రమంలో భాగంగా గ్రామానికి చెందిన 50 మంది గిరిజన రైతులు సాగు చేస్తున్న భూమికి డి-పట్టాలు అందజేశారని తెలిపారు. నాలుగు రోజుల క్రితం అటవీ శాఖ అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వకుండా, సాగు చేస్తున్న భూముల్లో మొక్కలు నాటి, సర్వేరాళ్లను పాతివేశారని వాపోయారు. స్పందించిన తహశీల్దార్ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కొటికిపెంట సర్పంచ్ ఇజ్జాడ అప్పలనాయుడు, గిరిజనులు పాల్గొన్నారు

గ్రామాల్లో వైద్య సేవలు విస్తరించాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

గ్రామీణ ప్రాంతాలకు ఆరోగ్య సేవలు విస్తరించేలా విద్యార్థులు కృషి చేయాలని వైస్ ఛాన్సెలర్ ప్రొఫెసర్ ప్రశాంత్ కుమార్ మహంతి పిలుపునిచ్చారు. సోమవారం ప్రపంచ అనస్థీషియా దినోత్సవాన్ని పురస్కరించుకొని సెంచూరియన్ విశ్వ విద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఏటా మోర్టన్ గౌరవార్థం అక్టోబర్ 16న అనస్థీషియా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటు న్నామన్నారు. ఈ ఏడాది 'అనస్థీ షియా, కేన్సర్ కేర్' అనే థీమ్‌తో అన్ని చోట్ల కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. ఎన్‌ఆర్‌ఐ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ నేడు ఆసుపత్రులలో సాంకేతిక నిపుణుల కొరత ఉందన్నారు. ఈ కోర్సు నేర్చుకుంటున్న విద్యార్థులకు ఉజ్వల భవి ష్యత్ ఉందన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి మాట్లాడుతూ క్లినికల్ ప్రాక్టీస్ తప్పనిసరిగా నేర్చుకుంటేనే మంచి భవిష్యత్ ఉంటుంద న్నారు. అనంతరం గోడ పత్రిక ప్రదర్శనతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్‌ఎన్ ఆచార్యులు, డీన్ ప్రొఫెసర్ పిఎస్‌వి రమణారావు, చైతన్య, ముఖేష్, రషీద్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటండి : ఎమ్‌పి

ప్రజాశక్తి-మెరకముడిదాం

పచ్చని మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎంపి బెల్లాన చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం పెద్దమంత్రిపేట ఎస్ ఇండియా అధ్యక్షు లు, మాజీ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ఎస్. హరశ్రీరాములు ఆధ్వర్యంలో బైరిపురం సచివాలయం రోడ్‌లో, పెద్దమంత్రిపేట గ్రామంలో మొక్కలు నాటే కార్యక్ర మాన్ని సోమవారం నిర్వహించారు. ఎంఎస్‌ఆర్ కళాశాల, శ్రీహర డిగ్రీ కళాశాలలో డిజిటల్ క్లాస్, స్కిల్ డెవలప్ మెంట్ శిక్షణ కోసం కంప్యూటర్ ప్రారంభో త్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. మంచి ఆరోగ్యవంతమైన జీవితం కోసం, వాతావరణ కాలుస్యాన్ని నివారించేందుకు మొక్కలు నాటాలని తెలిపారు. విద్యార్థులందరూ ఒక గోల్‌ను ఏర్పర చుకొని తమ జీవిత లక్ష్యాలను సాధించుకొని కళాశా లకు అధ్యాపకులకు, తల్లి తండ్రులకు మంచి పేరు తీసుకు రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు తాడ్డి వేణుగోపాలరావు, బైరిపురం సర్పం చ్ పప్పల విజయ కుమారి, ఉపసర్పంచ్ పప్పల క్రిష్ణ మూర్తి, వైస్ ఎంపిపి కందుల పార్వతి, గ్రామ పెద్దలు పప్పల గ్రహణేశ్వరరావు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు చర్యలు

బొబ్బిలి: విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎపిఇపిడిసిఎల్ డిఇ ఆవాల అనంతరావు అన్నారు. బొబ్బిలిలో డిఇగా పని చేసిన పూడి హరి విజయనగరం టౌన్ డిఇగా బదిలీ కావడంతో బొబ్బిలి డిఇగా అనంతరావు సోమవారం బాధ్య తలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి 9 ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామన్నారు. నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. లోవోల్టేజ్ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జెఎంఎస్‌తో మెరుగైన వైద్య సేవలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మారుమూల గిరిజన గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు వైద్య సిబ్బందికి సూచించారు. మండలంలోని మండ గ్రామంలో జెఎఎస్ శిబిరాన్ని సోమవారం ఆయన పరిశీలించారు. వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు చేశారు. ఈ శిబిరాన్ని సర్పంచి ఎం.హైమావతి ప్రారంభించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలను అడిగి, ఏ మేరకు వైద్య సేవలు అందుతున్నాయో తెలుసుకున్నారు. మందులు, ఆరోగ్య తనిఖీ నివేదికలను పరిశీలించారు. అనంతరం ప్రతీ కౌంటర్ వద్ద ప్రజలకు అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. ఎంత మంది నమోదు అయ్యారని రిజిస్ట్రేషన్ కౌంటర్‌లో అడిగి తెలుసుకొన్నారు. ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు రిఫర్ చేస్తున్న వారిని ఆరోగ్య మిత్ర ద్వారా తగు దిశా నిర్దేశం చేయాలన్నారు. ల్యాబ్‌లో పరీక్షలను తనిఖీ చేసి నివేదికలను పరిశీలించారు. అనంతరం అంగన్వాడీ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాల్ సందర్శించి, అక్కడ పౌష్టికాహారం పరిశీలించారు.


గుమ్మలక్ష్మీపురం.. మండలో వైద్య శిబిరంలో ప్రజలతో మాట్లాడుతున్న డిఐఒ జగన్మోహనరావు

కార్యక్రమంలో తహశీల్దార్ రాములమ్మ, ఇఒపిఆర్‌డి జగదీష్ కుమార్, వైద్యులు ఎం.బుద్దేశ్వరరావు, పి.అభిలాష్, జి.ప్రభాకర్‌రావు, సర్పంచ్ ఎన్.హైమావతి, పాఠశాల హెచ్‌ఎం పాలక దేవానంద్, పంచాయతీ కార్యదర్శి ఎం.షర్మిల, సిడిపిఒ సిహెచ్ సుశీలదేవి, తదితరులు పాల్గొన్నారు.

సాలూరురూరల్ : ప్రజా శ్రేయస్సు కోసమే నిరంతరము ప్రభుత్వం పనిచేస్తుందని వైసిపి మండల అధ్యక్షుడు సువ్వాడ భరత్ శ్రీనివాస రావు తెలిపారు. సోమవారం కరాసువలసలో జరిగిన జగనన్న సరక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పిల్లలకు బాలింతలకు పౌష్టికాహారం అందించే విధానాన్ని అంగన్వాడీలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ గొల్లపల్లి పార్వతి, సర్పంచ్ ఒంటి లక్ష్మీ, ఒంటి పరమేష్, వైసిపి నాయకులు సువ్వడ రామకృష్ణ, పెద్దింటి మాధవ రావు, నాయుడు, సీతా రాం పాల్గొన్నారు

సీతంపేట : మండలంలోని మర్రిపాడు పిహెచ్‌సిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్యాధికారి డాక్టర్ సాయిచరణ్ ఆధ్వర్యంలో నిర్వహించారు 422 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య నిపుణులు, సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం : గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని సర్పంచ్ పి.కామేశ్వరరావు అన్నారు. గోర గ్రామంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపిటిసి సవర ప్రశాంతి, ఎంపిడిఒ వై వెంకటరమణ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

ప్రజాశక్తి-సీతంపేట

చంద్రబాబుకు అరెస్టుకు నిరసనగా టిడిపి నాయకులు నిరసనలు కొనసాగుతున్నాయి. మండలంలోని పెద్దూరులో బాబుతో నేను సైతం కార్యక్రమంలో బాగంగా ఇంటి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడును అన్యాయంగా అరెస్టు చేశారని వివరించారు. పాలకొండ నియోజకవర్గ ఇంచార్జ్ నిమ్మక జయకృష్ణ, రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి బిడ్డిక చంద్రరావు, మండల పార్టీ అధ్యక్షులు సవర తోట మొఖలింగం, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గంట సుధ, ఐటిడిపి హిమరక పవన్, సర్పంచ్ బిడ్డిక నీలయ్య, మండంగి కుమార్, మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : జియ్యమ్మవలస మండలం చింతలబెలగాం పంచాయతీ సింగనాపురంలో టిడిపి నాయకులు నిరసన తెలిపారు. ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు అక్రమ అరెస్ట్ గురించి వివరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు పల్ల రాంబాబు, టిడిపి అరుకు పార్లమెంట్ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, ఎంపిపి బొంగు సురేష్ ,ఎస్టీ సెల్ నాయకులు నందివాడ కృష్ణబాబు, కొప్పలవెలమ సాధికార సమితి అధ్యక్షులు మూడడ్ల సత్యం నాయుడు, ఎంపిటిసి జి సత్యం నాయుడు, నీటి సంఘం అధ్యక్షులు ఎల్. స్వామి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గరుగుబిల్లి : మండలంలోని గిజబ గ్రామంలో బాబుతో నేను కార్యక్రమం నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోయక జగదీశ్వరి ఆధ్వర్యాన జరిగింది. చంద్రబాబు అక్రమ అరెస్టు ఖండించి ప్రజలకు వివరించారు. జగన్‌ను ఇంటికి పంపే రోజులు దగ్గరపడ్డాయని అన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అక్కేన మధుసూదన్ రావు, నాయకులు ఎం. పురుషోత్తమ నాయుడు, అంబటి రాంబాబు, స్థానిక ఎంపిటిసి సింహాచలం, మాజీ సర్పంచ్ ఎం.కృష్ణంనాయుడు, మండల రాంబాబు , ఎం.కురిమినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : మండలంలో చినబొండపల్లిలో టిడిపి ఆధ్వర్యంలో బాబుతోనే నేను కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బోనెల విజయచంద్ర ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, పోల సత్యనారాయణ , బోను చంద్రమౌళి చంటి, గొంగాడ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.




గరుగుబిల్లి, సీతంపేట మండలాల్లో చంద్రబాబుకు మద్దతుగా ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు, కార్యకర్తలు


గిరితో కోచ్ నరేష్

రాష్ట్ర స్థాయి కరాటే పోటీకి గిరిజన విద్యార్థి

ప్రజాశక్తి - కురుపాం

కురుపాంలోని మహాలక్ష్మి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పువ్వల గిరి.. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-19 కరాటే పోటీల్లో సత్తాచాటాడు. రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు కరాటే కోచ్‌లు జి.గోపాల్, కె.నరేష్ తెలిపారు. నవంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటాడని తెలిపారు. గిరిని ప్రిన్సిపల్, సిబ్బంది అభినందించారు.

సహజ వనరులతోనే ఆహార భద్రత

ప్రజాశక్తి-కురుపాం

భూమి, నీరు, అడవి వంటి సహజ వనరుల అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ ద్వారా ఆహార భద్రత సాధ్యమవుతుందని బియ్యాలవలస సర్పంచ్ పువ్వల అజ్జరి అన్నారు. సోమవారం బియ్యాలవలస పంచాయతీలోని దురిబిలి వద్ద యూత్ ఎంపవర్ మెంట్ సర్వీస్ సొసైటీ అధ్యక్షులు షేక్ గౌస్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆదివాసీ ప్రాంతాల్లో సంపూర్ణ ఆహార భద్రత సాధనకు ప్రభుత్వం కూడా తగిన ప్రోత్సాహం అందించాలన్నారు. 29 రకాల ఆహార ధాన్యాలు, పండ్లు, కూరగాయలు, దుంప జాతులతో స్టాల్‌ను ఏర్పాటు చేసి వీటి ప్రాముఖ్యత పై గిరిజనులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పువ్వల పత్తి, ప్రకృతి వ్యవసాయం ఫార్మ్ సైంటిస్ట్ నర్సమ్మ హాజరయ్యారు.

18న చిట్టపూడివలసలో ఆరోగ్య సురక్ష

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని చిట్టపూడివలస గ్రామంలో ఈ నెల 18న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ వై.వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమాన్ని చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి-గరుగుబిల్లి

గ్రామస్థాయి నుంచి బాల్య వివాహ నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసేందుకు ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్‌పి వైస్ చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు అధికారులకు సూచించారు. మండల కేంద్రంలోమండల వైఎస్సార్ క్రాంతిపదం ఆధ్వర్యంలో బాల్యవివాహ రహితభారతదేశం కార్యక్రమంలోభాగంగా మహిళాసంఘాలు చేపట్టిన ర్యాలీని వీరు ప్రారంభించారు. బస్టాండ్ ఆవరణలో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞచేశారు. అనంతరం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ బాల్యవివాహాలు చట్టరీత్యా నేరమని పేర్కొన్నారు. స్థానిక సర్పంచ్ కలిశెట్టి ఇందుమతి, ఎంపిడిఒ జి. పైడితల్లి, ఇన్చార్జి తహశీల్దార్ పెల్లూరి సత్యలక్ష్మి కుమార్, ఎంఇఒ నగిరెడ్డి నాగభూషణరావు, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక మండలమహిళా సమాఖ్యఅధ్యక్షురాలు గంట లక్ష్మి, ఎపిఎం పెద్దిరెడ్ల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : బాల్య వివాహాలను అరికట్టాలని కోరుతూ స్థానిక బజార్ నుంచి బస్టాండ్ వరకు బస్టాండ్ నుండి పెద పెద్ద భోగిలి వరకు వైఎస్‌ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎపిఎం శ్రీరాములనాయుడు మాట్లాడుతూ 18 ఏళ్ల నిండకుండా పిల్లలకు పెళ్లిళ్ల చేయకూడదని ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేయాలని అన్నారు.


మక్కువ.. చప్పబుచ్చంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు

సిసిలు కోటేశ్వరరావు ఆనందు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పార్వతీపురంరూరల్ : బాల్య వివాహాలనే సామాజిక దురాచారాన్ని నిర్మూలించడానికి ప్రతి గ్రామంలోనూ స్వయం సహాయక సంఘాల మహిళలు అవగాహన కల్పించాలని డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా మహిళా సమాఖ్య భవనంలో జరిగిన ఒక కార్యక్రమంలో గ్రూపు సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాల వల్ల రక్తహీనతతో బాధపడతారని, పుట్టిన శిశువులు బలహీనంగా తయారవుతారని తెలిపారు. దీనివల్ల మాతా, శిశు మరణాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ఇదే కార్యక్రమాన్ని పెదబొండపల్లి సచివాలయంలో ఎపిడి వై.సత్యంనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఎపిఎంలు త్రినాథమ్మ, ఐబి.జయమ్మ, సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

మక్కువ : బాల్య వివాహాలను అరికట్టే దిశగా అందరూ నడుం బిగించాలని ఎపిఎం సన్నిబాబు పిలుపునిచ్చారు మండలంలోని అన్ని పంచాయతీ కేంద్రాల్లో సెర్ప్ ఆదేశాల మేరకు సోమవారం ఈ కార్యక్రమం చేపట్టారు. విద్యార్థులకు, మహిళలకు బాల్యవివాహాల వల్ల జరిగే అరిష్టాలను ఈ సందర్భంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. బాల్య వివాహాలను అరికట్టేందుకు కృషి చేస్తామని అందరితోనూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు, వైకెపి సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎల్విన్‌పేటలో ఇంటింటి సర్వే


గుమ్మలక్ష్మీపురం.. సర్వే చేపడుతున్న సర్పంచ్, సచివాలయ సిబ్బంది

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట సచివాలయం-1 పరిధిలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆర్.చైతన్య స్రవంతి, పంచాయతీ కార్యదర్శి శ్యామల ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్షపై ప్రజలకు వివరించారు. కుటుంబ సభ్యుల వివరాలు, దీర్ఘకాలిక వ్యాధులు, ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ నెల 31న నిర్వహించే ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు.

గరుగుబిల్లి : జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై పెద్దూరు గ్రామంలో వాలంటీర్లు, ఆశావర్కర్లు ఇంటింటి సర్వే నిర్వహించారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించి వైద్య సేవలు అందిస్తామని వారు తెలిపారు.

నేరాలు ఘోరాలు

యువకుడు అనుమానాస్పద మృతి

శృంగవరపుకోట: పట్టణంలోని స్థానిక శ్రీనివాసకాలనీలో తమిళనాడు రాష్ట్రం ధర్మవరానికి చెందిన పెరుమల్ల గుణ (27) అనుమానస్పదంగా మృతి చెందినట్లు ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెరుమల్ల గుణ అనే యువకుడు పట్టణంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద హాట్‌షిప్స్ దుకాణం నిర్వహిస్తూ జీవనోపాధి పొందుతున్నాడు. ఆదివారం రాత్రి పట్టణంలోని శ్రీనివాస కాలనీలో అద్దెకున్న గృహంలో గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని మృతిని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మహిళ దుర్మరణం

రామభద్రపురం: గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందారు. ఆరికతోట జాతీయ రహదారిపై సోమవారం రాత్రి మహిళ మృతి చెందినట్లు గుర్తించిన వాహన దారులు ఇచ్చిన సమాచారం మేరకు ఏఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈమె గత కొన్నాళ్లుగా ఇక్కడ ఇంటింటా ముష్టి ఎత్తుకొని పొట్ట పోసుకునే అనాథ అని చెప్పుకుంటున్నారు. ఈమె మృతికి కారణమైన వాహన ఆచూకీ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మద్యం సీసాలతో వ్యక్తి అరెస్టు

భోగాపురం : మండలంలోని మహారాజపేట జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని సోమవారం పట్టుకుని అరెస్టు చేశామనిఎస్ఇబి ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. హెచ్‌సిలు సింహాచలం, వసంత కుమార్ తనిఖీలు చేయగా కొయ్య ప్రసాద్ అనే వ్యక్తి ఆరు మద్యం సీసాలతో పట్టుబడ్డారని ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి కోర్టు తరలించామన్నారు.



వయోజనులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపిపి శెట్టి పద్మావతి

వయోజన విద్యా కేంద్రాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - కురుపాం

నిరక్షరాస్యత నిర్మూలనకు వయోజన విద్యా కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి శెట్టి పద్మావతి అన్నారు. సోమవారం కురుపాంలో గాంధీనగర్ వీధి వద్ద స్వచ్ఛ హృదయ సేవా వికాస్ సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభించిన వయోజన విద్యా కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరక్షరాస్యత వల్ల ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. అందరూ అక్షరాస్యులుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం వయోజనులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి గ్రీవెన్స్ జిల్లా అధ్యక్షులు శెట్టి నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ షేక్ ఆదిల్, సంస్థ జిల్లా కోఆర్డినేటర్ ఎం.భీష్మారావు, వయోజన విద్యా సిబ్బంది మురళి, చిట్టిబాబు పాల్గొన్నారు.

ప్రకృతి కషాయాలు పంపిణీ

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖ రాజు ఆధ్వర్యంలో సోమవారం మండలంలో గోచెక్క, లిడికి వలస గ్రామాల్లో ప్రకృతి కషాయాలను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకుని, పంట కాలానికి అవసరమయ్యే ఎరువులను సహజ సిద్ధంగా గ్రామంలో లభించే జిల్లేడు ఆకుతో పొటాష్ పోషకాన్ని అందించవచ్చని తెలిపారు. చీడపీడల నివారణకు తూటి ఆకు కాడ కషాయం ఎంతగానో ఉపకరిస్తుందని తెలిపారు. దేశియ విత్తనాలను ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్స్ శ్రీరామ్ తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.